# నగరంలో నిరక్షరాస్యుల సర్వే

**-24నుంచి ఇంటింటి వివరాల సేకరణ: మేయర్**

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత గల రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు నిరక్షరాస్తుల చిట్టా తీస్తున్నామని నగర మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు

హైదరాబాద్ నగరంలో ఈనెల 24నుంచి మార్చి 4వ తేదీ వరకు నిరక్షరాస్యులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సర్వే జరుగుతుందని, నగరంలో 24.78లక్షల కుటుంబాలు, 97.97లక్షల జనాభా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వే కోసం 150వార్డులను 5404 లొకాలిటీలుగా విభజించినట్లు తెలిపారు. సర్వేకు 8681 మంది ఎన్యుమరేటర్లు అవసరమని చెప్పారు. ప్రతి ఎన్యుమరేటర్ పది రోజుల్లో 250 నుంచి 300 గృహాలు సర్వే చేస్తారన్నారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యుల వివరాలను నమోదు చేస్తామన్నారు. అలాగే, అదేఇంట్లో చదువుకున్నవారు ఉంటే వారితో, లేక సమీపంలోని చదువుకున్న వారితో నిరక్షరాస్యులకు విద్యను నేర్పించనున్నట్లు మేయర్ వివరించారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 22-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 178 పేజీలు: 4 వెల: రూ.1/-


# తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా శివరాత్రి

**శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు**

**ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

**నదీతీరాల్లో పుణ్యస్నానాలు..ఆలయాల్లో అభిషేకాలు**

**వేములవాడలో పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి**

**కీసరలో స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మల్లారెడ్డి**

**వేయిస్తంభాల గుడిలో అభిషేక సేవలో పాల్గొన్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి**



హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగుతున్నాయి. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంత్రులు ఆయా ఆలయాల్లో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంత్రులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతన్నాయి. ఓం నమఃశివాయ నామ స్వరణతో భక్తులు శివయ్యను దర్శించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసి భక్తులకు మహాలఘుదర్శనం కల్పిస్తున్నారు. రాజరాజేశ్వరస్వామి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు శివదీక్ష పరులకు ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన పూజ చేయనున్నారు. రాత్రి 11:30 గంటలకు గర్భగుడిలో స్వామి మహాన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకున్న నల్లగొండ జిల్లాలోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెర్వుగట్టు, పానగల్, వాడపల్లి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షుత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేయిస్తంభాల దేవాలయం, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. సాయంత్రం హన్మకొండ హయగ్రీవచారి మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సినీ నటుడు తనికెళ్ళ భరణి, పలువురు సినీ గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నిజామాబాద్ జిల్లాలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్దులగుట్ట ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా చెన్నూరు, గూడెం, లక్షెట్టిపేట, మంచిర్యాల, వేలాల గోదావరి ఘాట్ల వద్ద వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.

వేలాల మల్లిఖార్జునస్వామి ఆలయం, కత్తెరశాల మల్లన్న, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ సంతరించుకుంది. బాసర, సోన్, బ్రహ్మపురి వద్ద గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. శైవ క్షేత్రాల్లో భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. కదిలి పాపహరేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొమురం భీం జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా వాంకిడి శివకేశవ ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈజ్ గాం శివమల్లన్న జాతరకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాటి అన్నారంలోని ప్రాచీన శివాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేళ్లచెరువు శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా అలంపూర్ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కీసర గుట్టలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం తరపున మంత్రి మల్లారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. భద్రాద్రిలో మహాశివ రాత్రిని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అన్నపురెడ్డిపల్లి, మోతె వీరభద్ర స్వామి, పాల్వంచ రామలింగేశ్వర ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులతో పోటెత్తాయి. తీర్థాల సంగమేశ్వరాలయం, కూసుమంచి గణపేశ్వరాలయం, పెనుబల్లి నీలాద్రీశ్వరాలయం, బేతుపల్లి గౌతమేశ్వరాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లాలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఆ మహాదేవున్ని తనివితీరా దర్శించుకున్నారు. జిల్లాలో ప్రముఖ ఆలయమైన కేతకీ సంఘమేశ్వరాలయంలో భక్తుల రద్దీ పెరిగింది.

## తెలంగాణ ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు: కేసీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. శివాలయాల్లో వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సిఎం కెసిఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శివుడిని ప్రార్థించామన్నారు. మేడ్చల్ జిల్లా కీసర శ్రీరామలింగేశ్వర స్వామిని ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్ దర్శించుకున్నారు. కీసర దేవాలయాన్ని దర్శించుకున్న వారిలో మంత్రి మల్లారెడ్డి, ఎంఎల్‌సిలు నవీన్ కుమార్, శంభీపూర్ రాజు, ఎంఎల్ఎ కెపి వివేకానంద, జెడ్‌పి చైర్మన్ శరత్ చంద్రారెడ్డిలు ఉన్నారు.

## రాజ్యసభ సీట్లపై ఊహాగానాలు

**మాటమాత్రంగా అయినా రాని సంకేతాలు**

**అయినా ఎవరికి వారు పలువురి పేర్ల ప్రచారం**

**కవితకు రాజ్యసభ ఖాయమంటున్న గులాబీనేతలు**

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఖాళీ అవుతోన్న రెండు రాజ్యసభ సీట్లపై ఎప్పట్నుంచో రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నా..వీటిపై టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మాత్రం చూచాయగా కూడా తన అభిప్రాయం వెల్లడించలేదు. తుది నిర్ణయం తనదే కనుక ఆయన ఎప్పుడు కూడా తన మనసులో మాట చెప్పిన దాఖలాలు లేవు. టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లే ఈ రెండు స్థానాలపై పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నా,పార్టీ పరంగా కూడా ఎలాంటి ఊహాగానాలు రావడం లేదు. అయినా సమీకరణాల మేరకు కొందరు అటుఇటుగా పేర్లను ప్రచారం చేస్తున్నారు. గతంలో రాజ్యసబ సీట్లకు సంబంధించి బడుగుల లింగయ్య యాదవ్ తదితరుల విషయంలో కూడా సిఎం కెసిఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. అయితే నిజామబాద్ ఎంపిగా ఓటమి పాలయిన తరవాత మొదట్నుంచీ కవిత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. లోక్ సభలో గట్టిగా తెలంగాణ వాణి వినిపించి పేరు తెచ్చుకున్న కవిత... అనూహ్యంగా నిజామాబాద్‌లో బిజెపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఓటమిపాలు కావడంతో... రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగింది. అంతలోనే రాజ్యసభకు కాదు ఏకంగా రాష్ట్ర కేబినెట్లోకి తీసుకుంటారంటూ కథనాలు వచ్చాయి. అయితే, కవితను రాజ్యసభకు పంపడం ఖాయమైనట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ కు దక్కనున్న రెండు రాజ్యసభ సీట్లలో ఒక స్థానానికి కవిత పేరు దాదాపు ఖరారు అయ్యిందని అంటున్నారు. ఢిల్లీ స్థాయిలో అన్ని రాజకీయ వర్గాలతో సత్సబంధాలు కలిగివుండటం.... వాక్చాతుర్యం, హిందీ, ఇంగ్లీష్ మీద పట్టు ఉండటం.... తెలంగాణ సమస్యలు, అంశాల మీద సమగ్ర అవగాహన కలిగివున్న కవితను, రాజ్యసభకు పంపితే... హస్తినలో టీఆర్ఎస్ పాత్ర మరింత పెరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, కేసీఆర్ కూతురుగా ఉండే ఇమేజ్ ఎలాగూ ఉండనుంది. ఇలా, అన్నీ కవితకు కలిసొస్తున్నందున రాజ్యసభకు వెళ్లడం ఖాయ మంటున్నారు.

టిఆర్ఎస్ వాణిని గట్టిగా వినిపించడంతో పాటు కేంద్రంతో పోరాడాలంటే కవితలాంటి లీడర్ అవసరమన్న వాదానా ఉంది. అందుకే ఆమెకు సీటు ఖాయమని అంటున్నారు. ఒకవేళ ఆమెను రాజ్యసభకు పంపకపోతే కెసిఆర్ రాజ్యసభ ద్వారా కేంద్ర రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా ఉంది.

అప్పుడు కెటిఆర్ సిఎం, కవిత మంత్రి కావడం ఖాయం కానుంది. ఇక, మిగిలిన మరో సీటుపైనే మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, సీనియర్లు గంపెడాశలు పెట్టుకున్నారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇప్పటికే హమీ లభించినట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. ఖమ్మం ఎంపీ టికెట్ నిరాకరించినా..పొంగులేటి పార్టీకి విధేయులుగానే ఉన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ.. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేశారు. ఆయనకూడా రాజ్యసభ కోసం పట్టుపడుతున్నారు. ఇకపోతే మహబూబాబాద్ మాజీ ఎంపి సీతారాం నాయక్ కూడా ఎంపి సీటుపై ఆశలు పెట్టుకున్నారు. అలా ఉన్నవారిలో వేణుగోపాలాచారి, మధుసూధానాచారి తదితరులు కూడా ఉన్నారు.

# వేములవాడలో పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

**టిటిడి తరపున వస్త్రాలు సమర్పించిన అర్చకులు**

**హన్మకొండ వేయిస్తంభాల గుడిలో మంత్రులు ప్రత్యేక పూజలు**



వేములవాడ,ఫిబ్రవరి21(నేటినిజం ప్రతినిది): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామికి వస్త్రాలు సమర్పించి కుటుంబ సమేతంగా మంత్రి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు.

శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివెనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

అంతకుముందు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున అర్చకులు, అధికారులు శ్రీరాజరాజేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

టీటీడీ అర్చకులు, అధికారులు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి శ్రీవెంకటేశ్వర స్వామి వారి తీర్థప్రసా దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, కలెక్టర్ కృష్ణభాస్కర్, ఆలయ ఈవో కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా హన్మకొండ వేయి స్తంభాల దేవాలయంలో రుద్రేశ్వర స్వామికీ మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహాశివుడు రాష్ట్ర ప్రజలను సంతోషంగా చూడాలి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామని మంత్రులు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు సేవ చేసే శక్తి ఇవ్వమని కోరాము.

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలకు చాలా నిధులు ఇచ్చి సీఎం కేసీఆర్ దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ సంపద అయిన ఈ దేవాలయాన్ని కాపాడుకునేందుకు మా వంతు కృషి చేస్తామని తెలిపారు.

# దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్లకు ఏడేళ్లు

**నివాళి అర్పించిన ఎమ్మెల్యే, ప్రజలు**

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసుకు నేటితో ఏడేళ్లు పూర్తయ్యాయి. ఈ జంట పేలుళ్లలో 17 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మందికి గాయాలయ్యాయి. పేలుళ్లలో చనిపోయిన వారికి బాధిత కుటుంబాలు, స్థానికులు ఇవాళ నివాళులర్పించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు నివాళి అర్పించారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. 2013 ఫిబ్రవరి 21న సాయంత్రం 6:45 గంటలకు ఉగ్రవాదులు వరుస బాంబు పేలుళ్లకు పాల్పడిన విషయం తెలిసిందే. నిజంగా ఆ రోజు జరిగిన మారణహోమం ఇంకా కళ్లముందే కదలాడుతోంది. ఆ నెత్తుటి గాయం ఇప్పటికీ పచ్చిగా సలపరిస్తూనే ఉంది. 2013 ఫిబ్రవరి 21వ తేదీ సాయంత్రం 6:45 గంటలకు దిల్ సుఖ్ నగర్ జంట పేలుళ్లతో దద్దరిల్లింది. 17 మంది మాంసపు ముద్దలైపోయారు. 130 మంది తీవ్రంగా గాయపడ్డారు. మొదట మలక్ పేట, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కాగా, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో 2013 మార్చి 13న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఎ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసుపై చర్లపల్లి సెంట్రల్ జైలులో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసిన ఎన్ఐఎ మూడేళ్లపాటు విచారణ జరిపింది. 157 మంది సాక్ష్యాలను రికార్డ్ చేసింది. 502 డాక్యుమెంట్లు, 201 మెటీరియల్ ను పరిశీలించింది. నిందితులకు వ్యతిరేకంగా ఎన్ఐఎ వక్కా సాక్ష్యాధారాలు సమర్పించింది. ఎన్ఐఎ లాయర్లు కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. 2016 నవంబరు 7న వాదనలు పూర్తయ్యాయి. ఇండియన్ ముజాహిదీనే పేలుళ్లకు పాల్పడినట్టు తేలింది. నిందితులందరూ దోషులేనని 2016, డిసెంబర్ 13న ఎన్ఐఎ కోర్టు నిర్ధారించింది. సుదీర్ఘ విచారణ తర్వాత దిల్ సుఖ్ నగర్ పేలుళ్ల దోషులకు ఉరి శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది.

అసదుల్లా అఖ్తర్, వకాస్, తెహసీన్ అఖ్తర్, యాసిన్ భత్కల్, ఎజాజ్ షేక్ లను ఉరికంబం ఎక్కించాలని తీర్పు చెప్పింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రియాజ్ భత్కల్ పాకిస్థాన్ లో తలదాచుకుంటున్నాడు. మిగతా నిందితులు ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నారు.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు-జీపు ఢీ: నలుగురు మృతి**

ముంబయి,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. వైరాగ్ ఏరియాలో మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు – జీపు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జీపు నుజ్జునుజ్జు అయింది. నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు...నలుగురు మృతి

# పాక్ అనుకూల నినాదాలు

**యువతి అమూల్యకు 14రోజుల రిమాండ్**

**ఆమెను ప్రేరేపించిన శక్తులపై పోలీసులు ఆరా**

**నక్సల్స్‌తో సంబంధాలున్నాయని యెడ్డీ అనుమానం**

బెంగళూరు,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): కర్నాకట రాజధాని బెంగుళూరులో సీఏఏను వ్యతిరేకిస్తూ జరిగిన ర్యాలీలో పాక్ అనుకూల నినాదాలు చేసిన అమూల్య లియోనా అనే యువతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమెకు 14రోజుల రిమాండ్ విధించారు. ఈ ర్యాలీలో ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమూల్య లియోనా అనే యువతి పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసింది. ఆ స్లోగన్లపై స్పందించిన అసదుద్దీన్ ఓవైసీ ఆమెను వారించే ప్రయత్నం చేశారు. తాము భారతీయులమని యువతి వెనుక బీజేపీ హస్తం ఉందన్న ఓవైసీ ..యువతితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అమూల్య వ్యాఖ్యలపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దేశ ద్రోహం కేసు నమోదు చేసిన పోలీసులు యువతిని కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేపట్టిన కోర్టు 14రోజుల కష్టడి విధించింది. మరోవైపు అమూల్య వ్యాఖ్యలతో కొంతమంది చిక్ మంగళూరులోని ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దాడి ఘటనపై అమూల్య తండ్రి మాట్లాడుతూ తాము ఎంతచెప్పినా వినకుండా ముస్లీంలతో కలిసి సీఏఏ వ్యతిరేకంగా ర్యాలీ చేస్తుందన్నారు. దేశ ద్రోహం కేసులో అరెస్టైన తన కూతురు అమూల్య కోసం బెయిల్ కోసం ప్రయత్నం చేయడం లేదన్నారు. ఈ ఘటనను సిఎం యెద్యూరప్ప తీవ్రంగా ఖండించారు. ఆమెకు ఐఎస్ఐతో సంబంధాలు ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా సీఏఏ, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా గురువారం సాయంత్రం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సహా పలువురు ఈ ర్యాలీకి హాజరయ్యారు. ఈ క్రమంలో అమూల్య లియోన్ అనే యువతి వేదికపై పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసింది. దీంతో కంగుతిన్న నిర్వాహకులు ఆమె నుంచి మైక్ లాక్కుందామని ప్రయత్నించినా.. అమూల్య నినాదాలు కొనసాగించింది. ఈ నేపథ్యంలో అమూల్య తీరుపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఈ విషయం గురించి కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప మాట్లాడుతూ.. అమూల్యకు బెయిలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఆమె తండ్రి సైతం తనను రక్షించేందుకు సిద్ధంగా లేనని చెప్పారన్నారు. ఆయన మాటల ద్వారా అమూల్యకు నక్సల్స్‌తో సంబంధం ఉందన్న విషయం స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. తనకు తప్పకుండా తగిన శిక్ష పడుతుందని తెలిపారు. ఇక అమూల్య వ్యాఖ్యలకు నిరసనగా.. శ్రీరామ్ సేన, హిందూ జాగృతి సమితిసభ్యులు ఆందోళన చేపట్టారు. అమూల్య క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. అమూల్య ఇంటిపై కొంతమంది వ్యక్తులు రాళ్లతో దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా అమూల్య వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. ఇక అమూల్యను చిక్కమగళూరు జిల్లా కొప్పా తాలూకా శివపుర గ్రామవాసిగా పోలీసులు గుర్తించారు. అలాగే అమూల్యను ఆ కార్యక్రమానికి ఎవరు ఆహ్వానించారు.. పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాల వెనుక కారణాలేవైనా ఉన్నాయా? అన్న కోణాల్లో విచారణ జరుగుతోంది.

## అన్ని భాషలూ నేర్చుకోవాలి.. కానీ మాతృభాషను మరచిపోవద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 21: అన్ని భాషలూ నేర్చుకోవాలి.. కానీ మాతృభాషను మరిచిపోవద్దని ప్రభుత్వ సలహాదారు రమణాచారి అన్నారు. బీజేపీ నేత సీహెచ్ విద్యాసాగర్‌రావు నేతృత్వంలో నగరంలోని బేగంపేట హరితప్లాజాలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌తో పాటు పలువురు సాహితీవేత్తలను నిర్వాహకులు సత్కరించారు. అదేవిధంగా రమణాచారికి విశిష్ట పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. భాషలు అంతరించిపోకుండా ఉండేందుకు మాతృభాషా దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఆంగ్లం ఉంటేనే ఉద్యోగాలు దొరుకుతాయనేది సరికాదన్నారు. తెలుగులో చదివి కూడా ఐఏఎస్‌లుగా ఎంపికయ్యారన్నారు. మాతృభాషలో అవగాహన, అర్థం చేసుకునే పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. మాతృభాషను పరిరక్షించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ పుత్తడి బొమ్మగ - బాధల
కత్తులపై నడచు నట్టి కాంతా మణిగా -
చిత్రములను 'శ్రీరంజని'
మెత్తన్నగ గెలుచు కొనును ముగ్ధత్వముతోన్!

(ఫిబ్రవరి 22 జూనియర్ శ్రీరంజని జయంతి)



-రాధశ్రీ

సెల్: 9494481210

# భారత్‌తో బ్రహ్మాండమైన డీల్

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై మాట్లాడారు. 'బ్రహ్మాండమైన డీల్' కుదుర్చుకునే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అన్న తమ విధానాన్ని మాత్రం విస్మరించే ప్రసక్తే లేదన్నారు. మేం భారత్‌కు వెళ్లబోతున్నాం. అక్కడ మేం అద్భుతమైన (వాణిజ్య) ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. అయితే సరైన ఒప్పందం అనుకుంటేనే ముందుకు సాగుతాం. అమెరికాకే తొలి ప్రాధాన్యం అన్న మా విధానాన్ని కొనసాగిస్తాం. ఈ క్రమంలో సరైన ఒప్పందం కుదరకపోతే డీల్ విషయంలో మేం కాస్త వెనక్కి తగ్గొచ్చు. అధ్యక్ష ఎన్నికలు పూర్తయిన తర్వాత మళ్లీ దీనిపై ముందుకు వెళతాం. ఏదైనా జరగొచ్చు. చూద్దాం.. ఏం జరుగుతుందో అని లాస్‌వెగాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితమే వాణిజ్య ఒప్పందంపై అనుమానాలు వ్యక్తం చేసిన ట్రంప్ మరోసారి అదే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరో మూడు రోజుల్లో భారత పర్యటనకు రానున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్(సీఆర్‌ఎస్) తాజాగా విడుదల చేసిన నివేదికలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌తో అమెరికా వాణిజ్య లోటుపై ట్రంప్ పాలక వర్గం అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపింది. వాణిజ్యం విషయంలో భారత్ సరిగా వ్యవహరించడంలేదన్న అభిప్రాయంలో వారు ఉన్నట్లు పేర్కొంది. అమెరికా ఆకాంక్షలకు అనుగుణంగా ప్రధాని మోదీ తన తొలి ఐదేళ్ల పాలనలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని నివేదికలో అభిప్రాయపడింది. సుంకాల తగ్గింపు, అమెరికా వస్తువులకు భారత మార్కెట్‌ను సరళతీతరం చేయడం దిశగా మోదీ ప్రభుత్వం సాగలేదని ఆరోపించింది. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ప్రధాని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడింది. భారత్‌లో నెలకొన్న ఆర్థిక మందగమన పరిస్థితులపైనా ఆందోళన వ్యక్తం చేసింది.

కోటి మంది స్వాగతం పలుకుతారన్న ట్రంప్

భారత్‌లో తనకు దాదాపు 70 లక్షల మంది స్వాగతం పలకబోతున్నారన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీనిపై అహ్మదాబాద్ పురపాలక అధికారులు కూడా స్పందించారు. లక్ష నుంచి రెండు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ తరుణంలో ట్రంప్ తాజాగా చేసిన మరో ప్రకటన విస్మయానికి గురిచేస్తోంది. తొలుత చెప్పిన 70 లక్షల మందికి మరో 30 లక్షల మంది జోడించి కోటి మంది రాబోతున్నట్లు.. ఈ విషయం తనకు ప్రధాని మోదీయే స్వయంగా చెప్పినట్లు ప్రకటించుకున్నారు. కొలరెడోలో జరుగుతన్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ మరోసారి మోదీకి, తనకు మధ్య ఉన్న ఫేస్‌బుక్ బంధాన్ని గుర్తుచేసుకున్నారు. తాను ఫేస్‌బుక్‌లో 'నెంబర్ వన్'గా ఉన్నానని గతంలో చెప్పుకొన్న ట్రంప్ మరోసారి అదే మాటను పునరుద్ఘాటించారు. రెండో స్థానంలో మోదీ ఉన్నారన్నారు. అయితే భారత్ జనాభా ఎక్కువగా ఉండడమే మోదీకి కలిసివచ్చిందని చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్‌నకు ఫేస్‌బుక్‌లో 27 మిలియన్ల మంది అనుచరులు, మోదీకి 44 మిలియన్ల మంది అనుచరులు ఉండడం గమనార్హం.



శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీశైలంలో పాతాళగంగ వద్ద స్నానాల కోసంపోటెత్తిన భక్తులు

## భారతీయుడు షూటింగ్ ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు

చెన్నై,ఫిబ్రవరి21(ఆర్‌ఎన్‌ఎ): భారతీయుడు-2 సెట్స్‌లో జరిగిన ప్రమాదం గురించి చెన్నై పోలీసులు విచారణ మొదలుపెట్టారు. కమల్‌హాసన్ నటిస్తున్న భారతీయుడు-2 చిత్రానికి షూటింగ్ జరుగుతున్న సమయంలో క్రేన్ కూలింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారు. డైరక్టర్ శంకర్ వద్ద పనిచేస్తున్న ఇద్దరు అసిస్టెంట్లు ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం గురించి ఆరా తీస్తున్నామని, అక్కడ ఆ సమయంలో ఉన్న వారికి సమన్లు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు చెన్నై పోలీసులు తెలిపారు. మధు, చంద్రన్, కృష్ణ అనే ముగ్గురు టెక్నీషియన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో మరో 12 మంది గాయపడ్డారు. ఈవీపీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్ వేస్తున్న సందర్భంలో ఈ ప్రమాదం జరిగింది. శంకర్ తీస్తున్న ఈ సినిమాలో కమల్‌హాసన్, కాజల్ నటిస్తున్నారు. ప్రమాదంలో చనిపోయిన టెక్నీషియన్స్ కుటుంబసభ్యులకు కోటి రూపాయాలు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## శ్రీకాళహస్తికి పోటెత్తిన భక్త జనం

### వేకువజాము నుంచే స్వామి దర్శనం కోసం క్యూ వైవిధ్యమైన పూలతో మంటపాల అలంకరణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి21(ఆర్‌ఎన్‌ఎ): దక్షిణ కైలాసంగా.. వాయులింగ క్షేత్రంగా పూజలు అందుకుంటున్న శ్రీకాళహస్తిలోని శ్రీజ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభంగా సాగుతున్నాయి. తెల్లవారుజామున 2.30గంటల నుంచే భక్తులు కాళ హస్తీశ్వరుని దర్శనం కోసం బారులు తీరారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని స్వామి వారికి ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. అభిషేక ప్రియుడైన మహా దేవుణ్ని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ మండపాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఇందు కోసం ప్రత్యేకంగా 8 టన్నుల పండ్లు..పూలను బెంగళూరు నుంచి దేవస్థానం అధికారులు తీసుకొచ్చి అలంకరింపజేశారు. విద్యుద్దీప కాంతులతో ఆలయ పరిసరాలన్నీ మిరుమిట్లు గొల్పుతున్నాయి. శివరాత్రి పర్వదినాన స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ..రథోత్సవం, కల్యాణోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు.

# ఆసుపత్రుల్లో పెరుగుతున్న ప్రమాణాలు

## 450 ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు జాతీయ సంస్థ పరిశీలనలో తెలంగాణ బెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్‌ఎన్‌ఎ): నాణ్యత ప్రమాణాలు, రోగులకు సౌకర్యవంతమైన సేవలందించడం పట్ల కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్) గుర్తింపు పొందడంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ క్వాలిటీ అసురెన్స్ నోడల్ ఆఫీసర్ డా.రాంబాబు నాయక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ద్వారా చేపట్టిన కాయకల్ప అవార్డు పరిశీలనలో భాగంగా ఆయన ఇటీవల తాండూరులోని సర్కారు జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. సర్కారు ఆసుపత్రుల్లో నాణ్యత ప్రమాణాలు, రోగులకు సౌకర్యవంతమైన సేవలను అందించే ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ఎన్‌క్యూఏఎస్ ద్వారా తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ సిస్టమ్ రీసెర్చ్ సెంటర్(ఎన్‌హెచ్‌ఆర్సీ) కమిటీలతో సర్వే చేస్తుందని తెలిపారు. దేశంలో 18 వేల ఆసుపత్రుల్లో సర్వే చేయగా 450 ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వచ్చిందన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలువగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 100 ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వచ్చిందని, ఆంధ్ర రాష్ట్రంలో 74 ఆసుపత్రులు గుర్తింపు పొందాయని తెలిపారు. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ద్వారా 100 పడకలు ఉన్న ఆసుపత్రికి ఒక్కో బెడ్‌కు రూ. 10 వేల చొప్పున రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. మూడేళ్ల పాటు అందించే ఆర్థిక సహాయంతో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కాయకల్ప అవార్డు కోసం పోటీ పడుతున్న 1048 ఆసుపత్రులలో 250 ఆసుపత్రులు ఎంపిక అవుతున్నాయన్నారు. కాయకల్ప అవార్డు కోసం ఇంటర్నల్, పీర్, ఎక్స్టర్నల్ అసెస్‌మెంట్‌లు జరుగుతాయని తెలిపారు. కాయకల్ప కింద విన్నర్, రన్నర్ విభాగాల్లో జిల్లా ఆసుపత్రులకు రెండు, కమ్యూనిటీ ఆసుపత్రులకు రెండు, ఏరియా ఆసుపత్రులకు రెండు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మూడు అవార్డులు అందిస్తారని వివరించారు. గెలిచిన ఆసుపత్రికి రూ. 50 లక్షలు, రన్నర్‌గా నిలిచిన ఆసుపత్రి రూ. 25 లక్షలు ప్రోత్సాహం అందుతుందని వెల్లడించారు.

# మతప్రాతిపదికన విభజన సక్రమంగా జరగలేదు

## 1947 లోనే ముస్లింలను పాకిస్థాన్‌కు పంపించి ఉండాల్సింది

పాట్నా,ఫిబ్రవరి21(ఆర్‌ఎన్‌ఎ): దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలు, చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. 1947లోనే దేశ విభజన సందర్భంగా ఆనాడే మతప్రాతిపదికన ముస్లింలందర్నీ పాకిస్థాన్‌కు పంపించి ఉండాల్సిందని గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ముస్లిం దేశం ఏర్పాడాలంటూ 1947కు పూర్వమే జిన్నా ఒత్తిడి తెచ్చాడని గుర్తు చేశారు. దానికి మన పూర్వీకులు కూడా ఒప్పుకున్నారు. అప్పుడే దానిని అంగీకరించి వారిని పంపివుంటే బాగుండేదన్నారు. అలా చేయకపోవడం వల్ల ఇప్పుడు మనం మూల్యం చెల్లిస్తున్నామని అన్నారు. అప్పుడే కనుక ముస్లింలను పాకిస్థాన్‌కు పంపించి, అక్కడి హిందువులను ఇక్కడికి తీసుకొస్తే ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొనే వారమే కాదని పేర్కొన్నారు. భారత వంశీయులకు భారత్‌లో ఆశ్రయం ఇవ్వకపోతే, ఇంకెక్కడిస్తారు, వారెక్కడికి వెళ్తారు? అని గిరిరాజ్ సింగ్ ప్రశ్నించారు. పాక్ తదితర దేశాల్లో ముస్లింల దాడుల్లో హిందువులు అనేకులు ప్రాణాలు కోల్పోగా, అనేకులు ప్రాణాలు చేతబట్టి పారిపోయి వచ్చారని అన్నారు. వారికే పౌరసత్యం కల్పిస్తే కొందరు రాజకీయాల కోసం వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు.

# వచ్చే శివరాత్రికి ఏడుపాయలకు కాళేశ్వరం నీళ్లు

## వనదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి హరీష్ రావు

మెదక్,ఫిబ్రవరి21(నేటినిజం ప్రతినిది): సమైక్య రాష్ట్రంలో తెలంగాణలోని ఆలయాలకు అన్యాయం జరిగిందని మంత్రి హరీష్ రావు తెలిపారు. ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వం తరపున వనదుర్గ అమ్మవారికి పట్టు వస్త్రాలను మంత్రి హరీష్ రావు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే శివరాత్రికి కాళేశ్వరం నీళ్లు మెదక్ జిల్లాకు చేరుతాయని, కాళేశ్వరం పనులను సిఎం కెసిఆర్ యుద్ధ ప్రాతిపదికన చేయిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాలకు సిఎం కెసిఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దేవాదాయ శాఖను బలోపేతం చేసి ఉద్యోగులకు, వేతనాలు ఇస్తున్నామని హరీష్ వివరించారు. ఏడు పాయలకు వచ్చే భక్తుల కోసం మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మెదక్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎలు, పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డిలు పాల్గొన్నారు.




. కీసర రామలింగేశ్వర ఆలయ పూజలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, ఎంపి సంతోష్ కుమార్ తదితరులు

# గూగుల్ ప్లే స్టోర్ నుంచి 600 యాప్‌లు తొలగింపు

## అనుచిత ప్రకటనలు గుప్పిస్తున్నందుకే...గూగుల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): అనుచిత ప్రకటనలతో వినియోగదారులకు చికాకు తెప్పిస్తున్న దాదాపు 600 యాప్‌లను గూగుల్ తమ ప్లే స్టోర్ నుంచి తొలగించింది. ప్రకటనల విషయంలో సదరు యాప్‌లు తమ విధానాలను ఉల్లంఘించినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఎలక్ట్రానిక్ డివైజ్‌లను వినియోగిస్తున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా, డివైజ్ పనితీరును దెబ్బతీసేలా, అనుకోని రీతిలో తెరపై ప్రకటనలను ఇస్తున్న యాప్‌లను తొలగిస్తున్నట్లు గూగుల్ తెలిపింది. ఇప్పటికే దాదాపు 4.5 బిలియన్ల సార్లు ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సమాచారం. యాప్‌ని వినియోగించని సమయంలో, కాల్ చేస్తున్న సమయంలో కూడా ఇవి స్క్రీన్‌పై ప్రకటనల్ని చూపిస్తున్నట్లు గుర్తించారు. దీనివల్ల వినియోగదారుల విలువైన సమయం వృథా అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలోనే వీటిని యాప్ నుంచి తీసేశామన్నారు. ఇప్పటికే సదరు యాప్‌ల ద్వారా ప్రకటనలు ఇచ్చిన కంపెనీలకు లేదా ఉత్పత్తులకు నిబంధనల ప్రకారం డబ్బులు తిరిగి చెల్లిస్తామని తెలిపారు. కేవలం డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా సృష్టించిన ఇలాంటి మోసపూరిత యాప్‌లు చైనా, హాంకాంగ్, సింగపూర్, భారత్ కేంద్రంగానే పనిచేస్తున్నాయని గూగుల్ ఆరోపించింది. ఇంగ్లిష్ మాట్లాడేవారిని లక్ష్యంగా చేసుకొని వీటిని రూపొందిస్తున్నారని అభిప్రాయపడింది. ఏదైనా యాప్‌ను తొలగించేముందు దాని నిర్వాహకులకు తప్పును సరిదిద్దుకునేందుకు అవకాశం ఇస్తూ ముందుగానే నోటీసులు ఇస్తుందని గూగుల్ ప్రతినిధులు తెలిపారు. తొలగించిన వాటిలో చైనాకు చెందిన ప్రముఖ కంపెనీ 'చీతా మొబైల్' యాప్ ఉన్నట్లు సమాచారం.

# చైనా కంటే భారత్ అత్యంత సమస్యాత్మకం

## ప్యారిస్ ఒప్పందం నుంచి అమెరికాను దూరంచేయడం ట్రంప్ తప్పిదం

వాషింగ్టన్,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ) : వాతావరణ మార్పులపై పోరాటం, కార్బన్ ఉద్గారాల నియంత్రణలో చైనా కంటే భారత్ అత్యంత సమస్యాత్మకమని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థి, న్యూయార్క్ మాజీ మేయర్ మైకేల్ బ్లూమ్‌బర్గ్ అన్నారు. లాస్‌వెగాస్‌లో డెమొక్రటిక్ ప్రెసిడెన్షియల్ తొలి డిబేట్‌లో పాల్గొన్న బ్లూమ్‌బర్గ్ 2015 ప్యారిస్ వాతావరణ మార్పుల ఒప్పందం నుంచి అమెరికాను దూరం చేయడం ట్రంప్ ప్రభుత్వ తప్పిదమని దుయ్యబట్టారు. ఇక వాతావరణ మార్పుల విషయానికి వస్తే చైనా ఈ విషయంలో కొంత వెనక్కితగ్గినా భారత్ అత్యంత సమస్యాత్మకంగా మారిందని దీనిపై ఏ ఒక్కరూ ఏమీ చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనాలో మీరు ఎక్కువగా పెట్టుబడులు పెట్టిన క్రమంలో ఆ దేశం ప్రపంచంలోనే అత్యధికంగా కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్న క్రమంలో చైనాను మీరు ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించగా చైనాతో మనం యుద్ధానికి వెళ్లమని, వారితో మనం చర్చించి టారిఫ్‌లతో మనం ఎంత ఇబ్బందులు పడుతున్నామో వారిని ఒప్పించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. వాతావరణ మార్పులపై చైనా స్పందించని పక్షంలో వారి ప్రజలతో పాటు మన ప్రజలూ ప్రాణాలు కోల్పోతారని, దీనిపై మనమంతా కలిసి పనిచేయాల్సి ఉంటుందని బ్లూమ్‌బర్గ్ చెప్పుకొచ్చారు. వాతావరణ మార్పులపై అమెరికా భిన్నంగా స్పందిస్తోందని తాము బొగ్గు ఆధారిత విద్యుత్ ఎ÷-లాంట్లను మూసివేస్తున్నామని, ఇప్పటికే 304 ప్లాంట్లు మూతపడగా, యూరప్‌లో 80 కాలుష్యకారక ఎ÷-లాంట్లు మూతపడ్డాయని చెప్పారు.

# నా కూతుర్ని జైల్లో పెట్టినా తప్పులేదు

## అమూల్య తండ్రి స్పష్టీకరణ

బెంగళూరు,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): సీఏఏకు వ్యతిరేకంగా కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్వహించిన సభలో ఓ యువతి పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. కాగా.. యువతి ప్రవర్తించిన తీరుపై ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కూతుర్ని జైల్లో పెట్టినా తప్పులేదని, ఆమె కోసం తాను ఎలాంటి న్యాయపోరాటం చేయబోనని యువతి తండ్రి స్పష్టంగా చెప్పారు. అమూల్య వ్యాఖ్యలు టీవీలో, సోషల్‌మీడియాలో వైరల్ కాగానే కొందరు స్థానిక మీడియా విలేకరులు ఆమె తండ్రిని సంప్రదించగా ఆయన తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నా కూతురి ప్రవర్తన చూసి దిగ్భ్రాంతికి గురయ్యా. ఇలా మాట్లాడొద్దని చాలా సార్లు చెప్పినా అమూల్య ప్రవర్తనలో ఎలాంటి మార్పు రావట్లేదు. ఆమెను జైల్లో పెట్టినా.. పోలీసులు ఆమె కాళ్లు విరగ్గొట్టినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. తన వల్ల నా కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆమె కోసం నేను న్యాయపోరాటం కూడా చేయను' అని యువతి తండ్రి చెప్పుకొచ్చారు. కాగా.. పాక్‌కు అనుకూల నినాదాలు చేసినందుకు గానూ అమూల్యపై దేశద్రోహం కేసు నమోదైంది. దీంతో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం నేడు కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఈ కేసులో ఆమెకు న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌పీఆర్, ఎన్నార్సీకి వ్యతిరేకంగా బెంగళూరులో నిన్న సభ నిర్వహించారు. మజ్లీస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఈ సభకు హాజరై ప్రసంగించారు. అయితే ఓవైసీ ప్రసంగం తర్వాత 19ఏళ్ల అమూల్య లియోన్ ఒక్కసారిగా వేదికపైకి ఎక్కి పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేసింది. దీంతో షాక్‌కు గురైన ఓవైసీ వెంటనే ఆమె దగ్గరకు వెళ్లి మైక్‌ను లాక్కొనే ప్రయత్నం చేశారు.


**BEFORE THE HON'BLE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM XII ADDL. CHIEF JUDGE C.C.C. AT SECUNDERABAD M.V.O.P. NO.107 OF 2019**

Between:
**R. Shanthi and Others** .....Petitioner
**And**
**Md. Samadulla Khan and Others** ..... Respondents

To
R1- Md. Samadulla Khan
S/o. Aktar Mohammad Khan
Age: 50 Years, Occ: driver
H.No.17-9-25/3, 6th Lane,
Anandapet, Guntur,
R2- Shanker Jallepally
S/o. Pitchaiah, Age: Major,
Occ: Owner, R/o. # H15 C Main,
2nd Block, Narayanappa Block
R.T. Nagar, Bangalore-32.

Please take notice that the above matter the petitioners had filed case against you (Respondent No.1 and 2) for grant of compensation and the above case is posted for your appearance on dated **28-02-2020.**

You are advised to appear on **28-02-2020** at 10.30 a.m. before the said court either in person or through an advocate failing which, the case will be decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
**CH. INDRASENA REDDY**
**A.NARSIMHA**
Advocates.
Flat No.101 (3-6-628,
Srujana Apartments, Himayath
Nagar Petrol Pump X roads
Hyderabad-29.


# కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఇప్పటికీ ప్రాసంగికత ఉంది

## సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఇప్పటికీ ప్రాసంగికత ఉందని సీపీఎం** పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, లెఫ్ట్‌వర్డ్ సంపాదకుడితో కలిసి రాఘవులు శుక్రవారం కమ్యూనిస్ట్ మేనిఫెస్టో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ సిద్ధాంతాలు యువతలోకి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సీపీ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 21ను రెడ్‌బుక్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్ష పుస్తకాలు ప్రింట్ చేశామని.. ఆరెస్సెస్‌కు గట్టి జవాబుగా కమ్యూనిస్టు మేనిఫెస్టో ఉండటుందని పేర్కొన్నారు. 'ప్రజల చేతిలో ఆయుధం ఈ కమ్యూనిస్టు మేనిఫెస్టో. ప్రపంచవ్యాప్తంగా రైట్‌వింగ్ సిద్ధాంతాలు వస్తు న్నాయి. ఇవి చాలా ప్రమాదకరం. ఫ్రీ థింకింగ్, ఫ్రీ థాట్, అసమ్మతి తెలియజేయడం అనేది చాలా ముఖ్యం'అని వ్యాఖ్యానించారు.

# స్వైన్‌ఫ్లూతో సాఫ్ట్‌వేర్ సంస్థ మూసివేత

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): జర్మనీకి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎస్‌ఏపీ భారత్‌లో తన కార్యాలయాలను మూసివేసింది. సంస్థలోని ఇద్దరు ఉద్యోగులకు స్వైన్‌ఫ్లూ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొంది. బెంగళూరులోని ప్రధాన కార్యాలయంతో సహా గుడ్‌గావ్, ముంబయిలోని కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్ల ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా కరోనా (కొవిడ్-19) వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున తదుపరి ఆదేశాలు అందేవరకు ఉద్యోగులందరినీ వారి ఇళ్ల నుంచే పనిచేయాలని సూచించింది. స్వైన్‌ఫ్లూ సోకిన ఉద్యోగుల నుంచి ఇతరులకు ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా ఉండేందుకు కార్యాలయాలు మూసివేయాలని నిర్ణయించినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అంతేకాకుండా నివారణ చర్యలను కూడా చేపట్టింది. ఉద్యోగులు ఎవరైనా స్వైన్‌ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

# న్యూయార్క్ జడ్జిగా భారత సంతతి మహిళ

న్యూయార్క్,ఫిబ్రవరి 21(ఆర్‌ఎన్‌ఎ): అగ్రరాజ్యంలో మరో ఇండో- అమెరికన్ మహిళకు కీలక పదవి దక్కనుంది. భారత సంతతికి చెందిన సరితా కోమటిరెడ్డిని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఫర్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ జడ్జిగా నామినేట్ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అమెరికా న్యాయవ్యవస్థలోని వివిధ భాగాల్లో పనిచేసిన సరితా కోమటిరెడ్డి ప్రస్తుతం.. యూఎస్ అటార్నీ ఆఫీస్ ఫర్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ జనరల్ క్రైమ్స్ డిప్యూటీ చీఫ్‌గా పనిచేస్తున్నారు. గతంలో కూడా అదే కార్యాలయంలో... అంతర్జాతీయ నార్కోటిక్స్, మనీ లాండరింగ్.. కంప్యూటర్ హ్యాకింగ్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సమన్వయకర్తగా పనిచేశారు. అదే విధంగా బీపీ డీప్‌వాటర్ హొరిజన్ ఆయిల్ స్పిల్ అండ్ ఆఫ్‌షోర్ డ్రిల్లింగ్ జాతీయ కమిషన్ తరఫున లాయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే కెలాగ్ హన్సెన్ టాడ్ ఫిజెట్ అండ్ ఫ్రెడెరిక్ సంస్థలో ప్రైవేటుగా ప్రాక్టీసు చేశారు. కాగా హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి బీఏ పట్టా అందుకున్న సరితా కోమటిరెడ్డి.. హార్వర్డ్ లా స్కూల్ నుంచి జ్యూరిస్ డాక్టర్‌గా పట్టా పుచ్చుకున్నారు. అనంతరం న్యాయశాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా పనిచేశారు. కొలంబియా లా స్కూల్, జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ లా స్కూల్‌లో విద్యార్థులకు న్యాయ పాఠాలు బోధించారు. అదే విధంగా యూఎస్ కోర్టు ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా సర్క్యూట్ జడ్జి బ్రెట్ కావానా వద్ద లా క్లర్క్‌గా పనిచేశారు.

# తొలిటెస్ట్‌లో భారత్ బ్యాటింగ్ ఘోరం

## మళ్లీ విఫలమైన కెప్టెన్ కోహ్లీ వర్షంతో మధ్యలోనే మ్యాచ్‌కు అడ్డంకి

వెల్లింగ్టన్ ,ఫిబ్రవరి21(ఆర్‌ఎన్‌ఎ): వెల్లింగ్టన్ వేదికగా బేసిన్ రిజర్వ్ స్టేడియంలో ఇండియా, న్యూజిలాండ్‌ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ శుక్రవరాం ప్రాంభమయ్యింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకొని, భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కీవిస్ పేస్ బౌలర్ల దాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. టెస్ట్ మ్యాచ్‌లలో తడబడుతున్న కోహ్లీ మరోసారి విఫలమయ్యాడు. కేవలం 2 పరుగులకే జామిసన్ బౌలింగ్‌లో రాస్ టేలర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. భారత్ ప్రస్తుతం 5 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది.

రహానే, రిషభ్ పంత్ ప్రస్తుతం క్రీజులో ఉన్నారు. అయితే టీ విరామం తర్వాత మ్యాచ్ మొదలుపె ట్టేలోగానే వర్షం ప్రారంభమయింది. దాంతో ఈ రోజు మ్యాచ్‌ను అర్ధంతరంగా ముగించారు.

### విఫలమవుతున్న కోహ్లీ

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అంటేనే పరుగుల మెషిన్. మరి ఇప్పుడు కోహ్లీలో పస తగ్గిందా అంటే అవుననక తప్పదేమో. వన్డేల్లో 43 సెంచరీలు, టెస్టుల్లో 27 శతకాలతో మొత్తంగా అంతర్జాతీయ కెరీర్‌లో 70 శతకాలు సాధించి మూడో స్థానంలో కొనసాగుతున్నాడు కోహ్లీ. బ్యాట్ పడితే పరుగుల మోత మోగించే కోహ్లీ ఇటీవల కాలంలో దారుణంగా విఫలమవుతున్నాడు. గతేడాది నవంబర్‌లో బంగ్లాదేశ్‌తో కోల్‌కతాలో జరిగిన టెస్టు మ్యాచ్‌లో కోహ్లీ చివరిసారి సెంచరీ సాధించగా, ఆపై ఇప్పటివరకూ శతకాన్ని ఖాతాలో వేసుకోలేదు. న్యూజిలాండ్‌తో ఈరోజు ఆరంభమైన తొలి టెస్టులో కోహ్లీ మొదటి ఇన్నింగ్స్‌లో 2 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. ఓవరాల్‌గా న్యూజిలాండ్ పర్యటలో కోహ్లీ దారుణంగా విఫలమయ్యాడనే చెప్పాలి. కివీస్ పర్యటనలో కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే సాధించిన కోహ్లీ.. పరుగులు చేయడానికి అపసోపాలు పడుతున్నాడు. ఇక కోహ్లీ వరుస 19 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌ల్లో సెంచరీ లేకపోవడం

చర్చనీయాంశంగా మారింది. ఈ 19 ఇన్నింగ్స్‌ల్లో ఆరు హాఫ్ సెంచరీలు సాధించినా దాన్ని సెంచరీగా మలచుకోవడంలో కోహ్లీ విఫలమయ్యాడు. ఇలా 19 అంతకంటే ఎక్కువ ఇన్నింగ్స్‌ల పరంగా చూస్తే కోహ్లీ ఖాతాలో అంతర్జాతీయ సెంచరీ లేకపోవడం ఇది మూడోసారి. గతంలో 2011 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకూ 24 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ సెంచరీ సాధించకపోగా, 2014 ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకూ 25 వరుస ఇన్నింగ్స్‌ల్లో శతకం నమోదు చేయలేకపోయాడు. 2011లో వరుస 24 ఇన్నింగ్స్‌ల్లో 4 అర్ధ శతకాలకే పరిమితమైన కోహ్లీ.. 2014లో 25 వరుస ఇన్నింగ్స్‌ల్లో ఆరు హాఫ్ సెంచరీలు మాత్రమే చేశాడు. ఇప్పుడు కూడా అదే సీన్ రిపీట్ అయ్యింది. 2019లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సెంచరీ చేసే సమయానికి చూస్తే ప్రతీ ఆరు ఇన్నింగ్స్‌ల్లోనూ కోహ్లీ శతకం సాధించిన ఘనత ఉండగా, వరుసగా 19 ఇన్నింగ్స్‌ల్లో శతకం లేకపోవడం గమనార్హం. దాంతో తన 11 ఏళ్లకు పైగా ఉన్న అంతర్జాతీయ కెరీర్‌లో కోహ్లీ మూడో చెత్త ప్రదర్శన చేసినట్లయ్యింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.